

హైదరాబాద్ వార్త

# అన్నా..ఓటేసేందుకు కచ్చితంగా రావాల్నే...

-నగరంలోని తమ గ్రామస్తులకు అభ్యర్థుల ఫోన్లు
-ప్రత్యేక ఇంచార్జ్‌లతో రాయభారాలు ...దావత్‌లు
-రవాణా ఖర్చులు సైతం తామే భరిస్తామని హామీ



**హైదరాబాద్, డిసెంబరు 9,ప్రభాతవార్త:** అన్నా నమస్తే! బాగున్నారా? మన ఊరి సర్పంచిగా పోటీ చేస్తున్నా. మీరేమో ఊళ్లో లేరు. ఈ నెల 11న ఎలక్షన్‌కు తప్పకుండా రావాలి. మీ ఓటు నాకే వేయాలి. కావాలంటే మీ రానుపోను ప్రయాణ ఖర్చులు నేనే భరిస్తా. లేదా కారు పంపిస్తా.. అంటూ నల్గొండ జిల్లాలోని మునుగోడు నియోజకర్గంలోని ఓ గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి నగరంలోని ఎల్బీనగర్‌లో నివాసం ఉంటున్న తమ గ్రామం వారిని అభ్యర్థించారు. అలాగే మహబూనగర్‌జిల్లా కల్వకుర్తి సమీపంలోని ఓగ్రామానికి చెందిన ఓటర్లు దాదాపు 150మంది సంతోష్‌నగర్ ఏరియాలో నివసిస్తున్నారు..దీంతో వారిని ఊరికి తీసుకువచ్చేందుకు ప్రత్యేకంగా ఇద్దరు ఇంచార్జ్‌లను అధికారపార్టీకి చెందిన అభ్యర్థి నియమించాడు. గత నాలుగైదు రోజులగా వారు ఓటర్లను కలుస్తూ సాయంత్రం చుక్కముక్కతో దావత్‌లు ఇస్తున్నారు. ఓటింగ్ రోజు సైతం అన్నితామే చూసుకుంటామని అందరూ తప్పకుండా ఓటేసిపోవాలని అభ్యర్థిస్తున్నారు. ఇలా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ఓటర్లకు ఊరొచ్చి ఓటువేసిపోవాలని అభ్యర్థిస్తున్నారు. సర్పంచి, వార్డు పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు స్థానికంగా ఇంటింటికీ ప్రచారం చేస్తూనే, మరోవైపు ఓటెయ్యండి అంటూ నగరాల్లో నివసిస్తున్న గ్రామ ఓటర్లకు ఫోన్లు చేస్తున్నారు.

**ఇతర ప్రాంతాల ఓటర్లే కీలకం..**

అనేక పల్లెల్లో పోటీ తీవ్రంగా ఉండటంతో గ్రామం వెలుపలున్న ఓటర్లే జయాపజయాలకు కీలకమవుతారని అభ్యర్థులు భావిస్తున్నారు. దీంతో ఓటర్లకు ఫోన్ చేస్తూ అన్నా, అక్కా అంటూ బతిమాలుతున్నారు. ముఖ్యంగా ప్రధాన పార్టీల మద్దతుదారులైన అభ్యర్థులు గ్రామంలో ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ, ఊరికి దూరంగా నగరాలు, పట్టణాల్లో ఉండే ఓటర్ల సంఖ్య లెక్కలు తీస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో సగటున వంద నుంచి మూడొందల మందికి పైగా ఓటర్లు చదువు, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. వారిలో సుమారు 70 శాతం వరకు తటస్థంగా ఉంటారని అంచనా. .ఇలాంటి వారికి ఫోన్ చేసి ఊరికి రప్పించేందుకు అనేక మంది అభ్యర్థులు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నారు. అభ్యర్థులు లేదా వారి తరఫున ఇతర వ్యక్తులో నగరానికి వచ్చి తమ ఊరి ఓటర్ల ఇంటింటికి వెళ్లి ఓటు కోసం తలుపు తడుతున్నారు. కొందరు అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తుండగా, మరికొందరు తమ గ్రామ ఓటర్లను ఏదో ఒక హోటల్‌కి తీసుకెళ్లి చుక్క, ముక్కతో ప్రసన్నం చేసుకుంటున్నారు.

**ఊర్లకు తరలించేందుకు ఏర్పాట్లు..**

హైదరాబాద్‌లోని ఓటర్లను పోలింగ్‌కు తరలించేందుకు అభ్యర్థులు ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలోని ఓ గ్రామ పంచాయతీకి చెందిన దాదాపు 300మంది ఓటర్లు ఉప్పల్ ఏరియాలో ఉన్నారు. వారందరినీ ఓటింగ్‌కు తరలించేందుకు సర్పంచ్ అభ్యర్థి బస్సులు ఏర్పాటు చేశారు. తమ బస్సులో వచ్చే ఓటరుకు రూ.500తో పాటు టిఫిన్, భోజనం అందిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. అలాగే జనగాంకు చెందిన ఓగ్రామంలో 350 మంది ఓటర్లు హైదరాబాద్‌లో ఉన్నారు. సర్పంచ్ అభ్యర్థి తమ్ముడు వారికి ఫోన్లు చేసి మాట్లాడడమే కాక ఓటుకు రూ.వెయ్యి చొప్పున ఫోన్‌పే, గూగుల్ పే చేస్తున్నారని సమాచారం. ఇక, సొంత వాహనాల్లో వచ్చినా..తాము ఏర్పాటు చేసిన వాహనాల్లో వచ్చినా ఖర్చులు భరిస్తామంటూ హామీలిస్తున్నారు.




తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్" చర్చాగోష్ఠిలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , చిత్ర పరిశ్రమ రాకేష్ ఓంప్రకాష్ మెహ్రా , అల్లు అరవింద్, సురేష్ బాబు ,శామ్ ప్రదాద్ రెడ్డి ,రితేష్ దేశముఖ్ ,జానీలియా , జోయా అక్తర్ పాల్గొన్నారు ,



ముగింపు సందర్భగా ఆకాశంలో బాణాసంచా



అకకాశం డ్రోన్ షో

# హెల్మెట్,సీటు బెల్టు ధరించకుంటే యముడొస్తాడు

-రాణిగంజ్ చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ యమధర్మరాజు పాత్రధారి విజ్ఞప్తి

**బేగంపేట డిశంబరు 9,ప్రభాతవార్త** మీరు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నారా అయితే హెల్మెట్ ధరించండి.అదే కారులో ఇతరత్రా వాహనాలలో ప్రయాణిస్తుంటే సీటు బెల్టును తప్పక ధరించాలి.లేకుంటే ప్రమాదాల బారిన పడతారు.అదే సమయంలో యముడొస్తాడు. యమపాశం వేసి ప్రాణాలు తీసికెళ్తాడు.ఇప్పటికైనా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి.మీ ప్రాణాలు కాపాడుకోవడంతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా కాపాడండీ అంటూ యమధర్మరాజు పాత్రధారి రాణిగంజ్ చౌరస్తాలో వాహనదారులకు అవగాహన కల్పించారు.కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) కార్యక్రమంలో భాగంగా డా.గురవారెడ్డి పర్యవేక్షణలో శ్రవేణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహంకాళీ ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ మంగళవారం రాణిగంజ్ సిగ్నల్ వద్ద అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.రోడ్డుపైన వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణించే లైన్ల విషయంలో కూడా డిసిప్లేన్ పాటిస్తూ ముందుకు సాగాలన్నారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించిన పౌరులకు ప్రోత్సాహంగా చాక్లెట్లు ,రోజా పూలు అందజేసారు.నార్త్‌జోన్ ట్రాఫిక్1 ఏసీపీ జి.శంకర్‌రాజు మాట్లాడుతూ వాహనాలు రాంగ్ పార్కింగ్ చేయకూడదని,సిగ్నల్ జంపింగ్ చేయరాదని,ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని ,హెల్మెట్, సీటుబెల్టు లేకుండా డ్రైవింగ్,రైడింగ్ చేయరాదని, అలా చేస్తే వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.మీ బధ్రత మీ చేతుల్లోనే ఉందంటూ ఆయన తెలియజేసారు.



రాణిగంజ్ చౌరస్తాలో వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరిస్తున్న యమధర్మరాజు పాత్రధారి.

# అభ్యంతరాలు ఉంటే చెప్పండి..

-వార్డుల పునర్విభజనపై జిహెచ్‌ఎంసి నోటిఫికేషన్
-సలహాలు, సూచనలకు నేటి నుంచి 7రోజుల సమయం
న-సర్కిల్,జోనల్ కార్యాలయాల వద్ద హద్దుల వివరాలు జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్‌లోనూ తెలుసుకునే వెసులుబాటు




**హైదరాబాద్, డిసెంబరు 9,ప్రభాతవార్త:** ఇటీవల శివారు ప్రాంతాల్లోని 20 మున్సిపాలిటీలు,7 కార్పొరేషన్లను జిహెచ్‌ఎంసిలో విలీనం చేసిన సంగతి తెలిసిందే...ఈనేపథ్యంలో సోమవారం మొత్తం 300వార్డులుగా విభజించినట్లు తెలిపిన ప్రభుత్వం తాజాగా ఆయా వివరాలు వెల్లడించడంతోపాటు, అభ్యంతరాలు, సలహాలు సూచనలు ఉంటే చెప్పాలని 7రోజుల సమయం కేటాయించింది. ఈమేరకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. బుధవారం నుంచి 7రోజుల పాటు తమ సమీపంలోని సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో లిఖితపూర్వకంగా సలహాలు,సూచనలు, అభ్యంతరాలు తెలపాలని వెల్లడించారు. అలాగే ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు, సలహాలు స్వీకరించబడవని తెలిపారు. అలాగే వార్డుల పునర్విభజనపై ప్రత్యేకంగా జీహెచ్‌ఎంసి సర్వసభ్య సమావేశం నిర్వహించి కార్పొరేటర్ల అభ్యంతరాలను, సలహాలను స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా 300 వార్డులకు సంబంధించిన తూర్పు, ఉత్తరం, పడమర, దక్షిణం సరిహద్దులు స్పష్టంగా తెలియజేయడం జరిగిందని ఈ నలుదిక్కులు ఉండే కాలనీలు, బస్తీలు, ప్రాంతాలు ,ప్రతివార్డు ఏకాలనీ లేదా ఏ బస్తీలోని ఏ భవనం వద్ద లేదా ఏ రోడ్డు వద్ద, ఏ మూల మలుపులో మొదలైంది.. ఎక్కడ నులుపు లేదా ఏ రోడ్డు వద్ద ముగిసిందనే వివరాలు ఉంటాయన్నారు. వార్డుల హద్దులు తెలిసేలా సరిహద్దు భవనాలు, ఇంటినెంబర్లు, స్ట్రీట్ నెంబర్లు, రోడ్లు, నాలాలు, రైల్వే ట్రాక్ ప్రదేశాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. వార్డుల డీలిమిటేషన్ పై అభ్యంతరాలు, సలహాలు స్వీకరించి ఏ రోజుకారోజు చర్చించి , తగిన విధంగా నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

**ప్రజాప్రతినిధుల అభ్యంతరాలపై కౌన్సిల్ సమావేశం..**

ప్రజల నుంచి వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని, సలహాలను పరిష్కారంలో జాప్యం లేకుండా తగిన విధంగా వెనువెంటనే నిర్ణయాలను తీసుకునేలా జోనల్,డిప్యూటీ కమిషనర్లకు కమిషనర్ అధికారాలను అప్పగించారు. అలాగే పాత సర్కిళ్లతో పాటు కొత్తగా ఏర్పడిన సర్కిల్ ఆఫీసుల్లోనూ అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, సలహాలపై తగిన నిర్ణయాలు అనంతరం వాటిని పరిశీలించిన అనంతరం 10 రోజుల్లో ప్రత్యేకంగా కౌన్సిల్ సమావేశం నిర్వహించి, అందులో ప్రజాప్రతినిధుల సలహాలను, అభ్యంతరాలను కూడా తీసుకోనున్నట్లు తెలిపారు.

ముఖ్యంగా ఈడిలిమిటేషన్ ప్రక్రియ విమర్శలకు తావులేకుండా అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం చేయడంపైనే ఫోకస్ పెట్టామని 300 వార్డుల్లో ఎలాంటి లోపాలు,పొరపాట్లు దొర్లకుండా,చూసుకుని ప్రతి వార్డు దాదాపు అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

# రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

**చిక్కడపల్లి డిసెంబర్ 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికల నిర్వహించాలని ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 10న ఉస్మానియాలో జరిగే సభలో తెలంగాణ రాష్ట్రంలో యూనివర్సిటీలలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటన చేసి విధి విధానాలు ప్రకటించాలని వామపక్ష విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. భారత విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు ఆవశ్యకత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు పృథ్వి, ఎఐడిఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు నీతీష్,పిడిఎస్యూ రాష్ట్ర కార్యదర్శి ఎ.సాంబ, జార్జిరెడ్డి పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు డా:నాగేశ్వర్ రావు ,పిడిఎస్యూ విజృంభణ రాష్ట్ర ఉపాధ్యక్షులు పవన్, తెలంగాణ యువజన సంఘం శశంకార్,కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ,గాయకుడు తెలంగాణ శ్యామ్ లు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గత రెండు దశాబ్దాల కాలంలో జరిగిన ఘటనలు ఆధారంగా విద్యార్థి సంఘాల ఎన్నికలలో నిషేధించారని దాని వలన సమాజంలో రాజకీయాల్లో విలువలు, నీతి, నిజాయితీ తగ్గి రౌడీలు, అవినీతిపరులు కులం, మతం, విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులు బాబాలు ,సన్యాసులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజాస్వామిక వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. అందుకే తెలంగాణ విద్యా కమిషన్ తన సిఫార్సులలో తెలంగాణలోయూనివర్సిటీలలో ఎన్నికలు నిర్వహించాలని తెలిపిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు స్వయంగా తానే ఆగస్టు 25న ఉస్మానియా యూనివర్శిటీలో జరిగిన సభలో విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని అప్పుడే రాజకీయ వ్యవస్థలో అభివృద్ధి ,ప్రజాసేవ చేసే రాజకీయలు ఉంటాయని ప్రకటించారని గుర్తు చేశారు. ఉస్మానియాయూనివర్సిటీలో ఈనెల 10న ముఖ్యమంత్రి గారు సభకు హాజరవుతున్న సందర్భంగా కూడా విద్యార్థులు ఎన్నికలు నిర్వహణపై ప్రకటించి, విధివిధానాలు, ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.విద్యార్థి సంఘాల ఎన్నికలు ఉంటే విద్యా సంస్థలలో ఫీజుల పెంపు, మౌలికసదుపాయాలు , హాస్టల్స్ సదుపాయాలు, విద్యార్థినీల సమస్యలు, సైద్ధాంతిక అంశాలపై చర్చ జరిగి అనేక అంశాలు ముందుకు వచ్చి సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సామాజిక అభివృద్ధికి ఆటంకంగా ఉన్న డ్రగ్స్ ,సోషల్ మీడియా, లాంటి అంశాలపై చర్చలు కులం, మతం, దేశ అభివృద్ధి రాజ్యాంగ పరిరక్షణ లాంటి చర్చలు నిరంతరం జరుగుతాయని, అలా జరిగినప్పుడు విద్యార్థులు రాజకీయాల్లోకి రాణిస్తారని తెలిపారు. అందుకే సామాజికంగా వెనుకబడిన తెలంగాణ రాష్ట్రానికిదేశప్రజాస్వామ్యానికి విద్యార్థి సంఘం ఎన్నికలు కీలకమని వాటిని నిర్వహించే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుని చట్టం చేయాలని వారు తెలిపారు.రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు ఎన్నికల నిర్వహించుకుంటే రాష్ట్రవ్యాప్తంగావిద్యార్థులందరికీ తో ఆందోళనలో నిరసనలు కార్యక్రమాలు నిర్వహిస్తామని దానికోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య కార్యచరణ వామపక్ష విద్యార్థి సంఘాలు పోరాట కార్యచరణ రూపొందిస్తామని వారు తెలిపారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్‌ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.కిరణ్, కె. అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, జె.రమేష్ . హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేందర్,శ్రీమాన్, స్టాలిన్, జార్జిరెడ్డి, పిడిఎస్యూ హైదరాబాద్ కార్యదర్శి అంజి, ఎఐడిఎస్ఓ హైదరాబాద్ నాయకులు నాగరాజు ,ఎస్‌ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా నాయకులు కైలేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ ఎఫ్ ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు ఆవశ్యకత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన దృశ్యం

## మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా విజయ్ దివస్

**దుండిగల్, డిసెంబర్ 9, ప్రభాతవార** మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుల సూచనల మేరకు మంగళవారం కార్యాలయంలో ఘనంగా విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు ఘనంగా పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబండ వర్గాల పోరాటం అమరులు త్యాగం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో ఢిల్లీ పీఠం వణికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నేటికి 16 ఏళ్లు అయినా సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రథసారథి కేసీఆర్ 11 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి తెలంగాణ ప్రకటన వెలువడేలా చేసిన చారిత్రక రోజు ఈరోజు సందర్భంగా ఘనంగా విజయ్ దివాస్ కార్యక్రమం జరుపుకున్నట్లు బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విజయ్ దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

## ఇళ్లల్లో దొంగతనాలు చేస్తున్న ముఠా అరెస్ట్

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 9, ప్రభాతవార్త** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు హెచ్‌బీ నేరస్తులను అరెస్టు చేసి, పలు కేసులను ఛేదించినట్లు బాలానగర్ జోన్ డీసీపీ కె.సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయనా మాట్లాడారు. డిసెంబర్ 2న లిఫ్ట్ ట్రేడ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అకౌంట్స్ విభాగంలో ఉంచిన రూ.4 లక్షల నగదు చోరీకి సంబంధించి ఫిర్యాదు అందిందన్నారు. దర్యాప్తులో భాగంగా నిందితులైన గొనిగుంట వంశీ కృష్ణ, మట్టా భరత్ రాజీవ్ గాంధీ అలియాస్ భరత్ అలియాస్ రాయ్‌లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో నిందితులు ముందుగా తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రెక్కీ నిర్వహించి, ఇనుప రాడ్లతో తాళాలు పగులగొట్టి చోరీలు చేస్తున్నట్లు అంగీకరించినట్లు డీసీపీ వెల్లడించారు. చోరీ అనంతరం సమీపంలో ఉన్న ద్విచక్ర వాహనాన్ని అపహరించి పరారయ్యేవారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.2.27 లక్షల నగదు, హీరో గ్లామర్ ద్విచక్ర వాహనం, స్మార్ట్ వాచ్, బంగారు-వెండి ఆభరణాలు, రెండు సెల్‌ఫోన్లు, కార్ కీలు, ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై బాలానగర్, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ, మియాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం ఏడు కేసులు నమోదైనట్లు తెలిపారు.ప్రజలు తమ ఇళ్లను తాళం వేసి వెళ్లేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కేసు ఛేదనలో బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు ఆధ్వర్యంలో పోలీస్ బృందం చేసిన సమష్టి కృషి ఫలితమని డీసీపీ తెలిపారు.




వివరాలను వెల్లడిస్తున్న డిసిపి సురేష్ కుమార్

## నయనమనోహరం ఓమిషా దీక్షారెడ్డిల కూచిపూడి రంగప్రవేశం



ఓమిషా, దీక్షారెడ్డిల కూచిపూడి రంగప్రవేశంలో దృశ్యం

**రవీంద్రభారతి, డిసెంబరు 9 ప్రభాతవార్త :** ప్రముఖ శ్రీవారి పాదాలు భరతనాట్య, కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మంగళవారం రాత్రి ప్రముఖ నాట్యగురువు డా. ఎన్.రమాదేవి శిష్యులు ఓమిషా ఐశని, దీక్షారెడ్డిల కూచిపూడి రంగప్రవేశం నయనమనోహరం, రసభరితంగా సాగింది. ఇద్దరు కళాకారులు చిన్నవయస్సు నుండే శాస్త్రీయ కూచిపూడి నృత్యంపై మక్కువతో గురు రమాదేవి వద్ద శిక్షణ ప్రారంభించి సంపూర్ణ పరిణతిచెంది నేడు తమ నాట్యవిన్యాసంతో ప్రతిభను చాటుకున్నారు. ప్రార్థనానంతరం ముందుగా ఓమిషా, దీక్షారెడ్డిలు తమ కూచిపూడి రంగప్రవేశాన్ని మాలికరాగం ఆదితాళంలో బ్రహ్మాంజలి అంశంతో ప్రారంభించి తదుపరి జతిస్వరం, కృష్ణ శబ్దం, జావళి, నీలమేఘ శరీర తరంగం, కళింగనర్తన తిల్లాన, చివరిగా మంగళంతో తమ అద్భుత ప్రదర్శనను విజయవంతంగా ముగించారు. గురు చంద్రకాంత్ నట్టువాంగం, పద్మభూషణ్ గురు డా. వెంపటి చిన్నసత్యం, కె.పద్మావతిల కొరియోగ్రఫీ, చంద్రరావు గాత్రం, శ్రీధర్ ఆచార్య మృదంగం, ఉమా వెంకటేశ్వర్లు వేణువుతో అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. చివరిగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ దీపిక నగేష్ కళాకారిణిలను సన్మానించి శుభాశీస్సులు, నాట్యగురువు ఎన్.రమాదేవికి అభినందనలు తెలిపారు.

# సిఎం ప్రజావాణిపై హరీష్ రావు నిరాధార ఆరోపణలు

- దిగజారి మాట్లాడుతున్న హరీష్
- ప్రజావాణి ఇంచార్జి డా.చిన్నారెడ్డి

**బేగంపేట డిశంబరు 9,ప్రభాతవార్త** సీఎం ప్రజావాణీ ప్రజా సమస్యల పరిష్కారంలో దాదాపు 70శాతం సక్సెస్ రేటు ఉందని,మాజీ మంత్రి ,బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు సీఎం ప్రజావాణీపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని సీఎం ప్రజావాణీ ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి అన్నారు. వాస్తవాలు తెల్సుకోకుండా హరీష్ రావు మాట్లాడటం సరికాదన్నారు.శుద్ద అబద్దాలతో తప్పుడు సమాచారంతో హరీష్ రావు కాలం గడుపుతున్నారని చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.సీఎం ప్రజావాణీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని ప్రజాభవన్‌లో అధికారిక కార్యక్రమాలు మాత్రమే జరుగుతాయన్నారు.కరీంనగర్‌కు చెందిన గొడుగు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కాలేదని హరీష్‌రావు విమర్శించారని,అసలు ఆ వ్యక్తి ఎవరో తమ రికార్డుల్లో లేదన్నారు.హరీష్ రావు తన గౌరవాన్ని కాపాడు కోవాలని చిన్నారెడ్డి సూచించారు. కనీసం కన్నెత్తి చూసే పరిస్థితి కూడా లేని ప్రగతి భవన్ ఇనుక కంచెలను బద్దలు కొట్టి ప్రజా భవన్‌గా మార్చి సీఎం ప్రజావాణీ ద్వారా ప్రజలు నేరుగా సమస్యలు చెప్పుకునే అవకాశాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కల్పించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరుపున తాను,సెర్చ్ సీఈఓ దివ్య దేవరాజన్ రెగ్యులర్ (మంగళవారం, శుక్రవారం) గా ప్రజావాణీ నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చిన్నారెడ్డి వివరించారు.

## తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియా గాంధీదే : ఎమ్మెల్యే శ్రీగణేష్


పికెట్‌లో సోనియా గాంధీకి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,డిసెంబర్ 9 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజల అకాంక్ష నెరవేర్చి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన గొప్ప మహా నాయకురాలు, ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. సోనియా గాంధీ జన్మది నాన్ని పురస్కరించుకొని మంగళవారం పికెట్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అమె చిత్రపటానికి పాలాభిషేకం జరిపి కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను గౌరవించి అకాంక్షలను నెరవేర్చడానికి సోనియా గాంధీ అని గుర్తు చేశారు. ఆమె ఆయురారోగ్యాలతో జీవించాలని, దేశానికి మరిన్ని సేవలు అందించాలని అకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, కాంగ్రెస్ నాయకులు నాగినేని సరిత, బద్రినాథ్ యాదవ్, దుద్దు రవికుమార్, మారుతీ గౌడ్, బల్వంత్‌రెడ్డి, సంకి రవిందర్, శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలి

### ఎఐటియుసి నేత ఎం.నర్సింహ్మా డిమాండ్

**సైఫాబాద్, డిసెంబరు 9 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11,14,17 తేదీలలో గ్రామ పంచాయితీ ఎన్నికలు జరగుతున్న నేపథ్యంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్య దర్శి ఎం.నర్సింహ్మా కోరారు. చట్ట ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలలో పనిచేస్తున్న అన్ని రకాల ఉద్యోగులకు, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఎన్నికల తేదీనాడు వేతనంతో కూడిన సెలవు పొందే అధికారం ఉందన్నారు. జిహెచ్ఎంసి పరిధిలోనే ఒక లక్ష మంది ఉద్యోగులు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో, వివిధ ప్రభుత్వ పథకాలలో, ప్రైవేటు సంస్థల్లో విధులు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. రెండు రోజుల్లో ఎన్నికలు ఉన్నప్పటికి ఇంతవ రకు ప్రభుత్వం సెలవు దినం ప్రకటించకపోవడంతో ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నామనే మనో వేదనను వారు చెందుతు న్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేంతవరకు ఉద్యమిస్తాం


అభిలాష్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, భరత్‌కుమార్

**సైఫాబాద్, డిసెంబరు 9 ప్రభాతవార్త:** బిసిల డిమాండ్ల సాధన కోసం జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్‌తో ఆధ్వర్యంలో పనిచేస్తానని సంఘం నూతన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మేడ ల అభిలాష్‌గౌడ్ చెప్పారు. బిసిల ఓట్లుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను అణగదొక్కాలని ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేంతవరకు వారితో కలిసి ఉద్యమిస్తానని చెప్పారు. ఈ మేరకు బిసి భవన్‌లో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా అభిలాష్‌గౌడ్‌ను వారు నియమించిన సందర్బంగా మాట్లాడారు. ఆయనకు ఆర్.కృష్ణయ్య, భరత్‌కుమార్ నియామక పత్రాలను అందజేశారు.

## తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కెసిఆర్‌దే

### ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్


కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, డిసెంబర్ 9, ప్రభాతవార్త:** తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దీక్షబూని, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దేనని ముషీరా బాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కొనియాడారు. మంగళవారం ముషీరా బాద్ నియోజకవర్గంలోని ముషీరాబాద్, కవాడిగూడ, భోలక్‌పూర్ డివిజన్లలో విజయదివాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా ముషీరాబాద్‌లోని 44 బస్ స్టాప్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కవాడిగూడ డివిజన్ హైదరాబాద్ స్టడీ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి, యూపీఎస్సీ సెంటర్‌లో గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగా నగర్‌లో తెలుగుతల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలలో బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, స్థానిక డివిజన్ అధ్యక్షులు కొండా శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : లింగాని ప్రసన్న


అడ్డగుట్టలో మల్టీపర్‌పస్ ఫంక్షన్ హాల్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

**అడ్డగుట్ట,డిసెంబర్ 9 ప్రభాతవార్త:** అడ్డగుట్టలో కోట్లాధి రూపాయల వ్యయంతో చేపడుతున్న మల్టీపర్‌పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం పను ల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న తెలిపా రు. మంగళవారం ఆమె కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను జిహెచ్ఎంసి ఇంజనీర్లతో కలిసి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్,సత్తయ్య గౌడ్, నర్సింగ్, శివశంకర్, వడ్డెర ఎల్లయ్య, దేవయ్య, ఇంజనీర్లు సువర్ణ,పద్మ,అశలత తదితరులు పాల్గొన్నారు.

**విజయ్ దివస్ వేడుకల్లో కార్పోరేటర్ లింగాని ప్రసన్న . . .**

బిఆర్ఎస్ అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం అడ్డగు ట్ట తుకారాంగేట్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళుల ర్పించారు. ఈ సందర్బంగా లింగాని మాట్లాడుతూ కేసిఆర్ చేపట్టిన దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పెండం మనోహర్,లింగాని శ్రీనివాస్, సత్త య్య గౌడ్,శ్రీనివాస్ గౌడ్, ఎల్లయ్య, వసంత, దేవయ్య, పొన్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ ఉద్యమ ఫలితమే స్వరాష్ట్ర సాధన


బోయిన్‌పల్లిలో తెలంగాణ తల్లికి,అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి తదితరులు


ఉస్మానియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణి చేసిన బిఆర్ఎస్ హైదరాబాద్ ఇన్‌చార్జ్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్


బి.ఆర్.ఎస్ ఆధ్వర్యంలో విజయ్‌దివాస్ స్కూటర్ ర్యాలీ


చందానగర్‌లో బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద విజయ్ దివాస్‌లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

**గోషామహల్ నియోకవర్గంలో**

**అఫ్జల్‌గంజ్,డిసెంబర్ 9ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రక్రియలో చారిత్రాత్మకమైన డిసెంబర్ 9పురస్కరించుకుని 'విజయ్‌దివాస్' వేడుకలను గోషామహల్ నియోకవర్గంలోని ఘనంగా నిర్వహించారు.ఉస్మానియా ఆసుపత్రిలో రోగులు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్,బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలతో కలిసి వెళ్లి పండ్లను అంద చేశారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పార్టీ వర్కింగ్ అధ్యక్షులు కెటిఆర్ పిలుపు మేరకు అన్ని డివిజన్ల అధ్యక్షులు,ఉద్యమకారులతో కలిసి విజయ్‌దివాస్ వేడుకలను నిర్వహించినట్లు చెప్పారు. తెలం గాణ తల్లి,కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయడంతో పాటు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించినట్లు చెప్పారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులుశ్రీనివాస్‌యాదవ్,బద్రీనాథ్,కిషోర్,గణేష్,రమేష్ గౌడ్,నాగరాజుగుప్త,జగదీష్‌గుప్త,స్వరూప,శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు

**కోఠి పార్టీ కార్యాలయంలో**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కెసిఆర్ చేసిన దీక్షతో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రకటన ఎంతో దోహదపడిందని గోషామ హల్ నియోజకవర్గం బిఆర్ఎస్ఇన్‌చార్జ్ ఆర్వీమహేందర్ కుమార్ అన్నారు.బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.టి.ఆర్ పిలుపుమేరకు మంగళవారం తెలంగాణ విజయ్ దివాస్ సందర్బంగా కోఠిలోని పార్టీ కార్యాలయం వద్ద బి.ఆర్.ఎస్ జెండాను ఎగుర వేశారు.ఆర్వీమహేందర్ కుమార్ ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీని ప్రారంభించారు. నియోజకవర్గంలోని గన్‌ఫౌండ్రి,బేగంబజార్, గోషామహల్, మంగళ్‌హాట్,జాంబాగ్ డివిజన్‌ల్లో స్కూటర్ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, మిశాలక్రాంతి,కిషోర్‌గుప్త,రమేష్‌గౌడ్,నరేష్,సునీల్‌సింగ్,నవీ న్‌వర్మ,శేఖర్,ఆశ్విన్,బి.రాజేందర్,రవి పాల్గొన్నారు.

**చందానగర్ డివిజన్‌లో**

**శేరిలింగంపల్లి,డిసెంబర్ 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమ ఫలితంగానే స్వరాష్ట్రసాధన సాధ్యమైందని చందానగర్ డివి జన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి అన్నారు. శేరిలిం గంపల్లి నియోజక వర్గం చందానగర్ డివిజన్‌లో విజయ్ దివాస్ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, తెలంగాణ తల్లి, కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తెలంగాణ ఏర్పాటు విజయానికి సూచిక గా పింక్ బెలూన్లను గాలిలోనికి ఎగురవేశారు. ఈ సంద ర్భంగా మినిమం వేజ్ బోర్డు మాజీ ఛైర్మన్ సామ వెంక టర్రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి,శ్రీకాంత్ మా ట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో కీలకమ లుపు తిరిగిన డిసెంబర్ 9వ తేదిని విజయ్ దివాస్‌గా ఘనంగా నిర్వహించుకోవడం సంతోషదాయకమన్నారు. విజయ్ దివాస్ చరిత్రలో నిలిచిపోయే రోజని అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పారునంది శ్రీకాంత్, వాలా హరీశ్, సంగారెడ్డి, కిరణ్‌యాదవ్; అల్లావుద్దీన్; రామ కృష్ణగౌడ్,ప్రకాశ్, సలీం,బాల్‌రాజ్,బాబు, మల్లేశ్, రాజు, గణేశ్‌రెడ్డి, గౌస్,వంశీ,శ్రీను, శివ,సునీత, శభానా, అనం తరెడ్డి, అష్రాఫ్, నగేశ్‌రెడ్డి, బాబా, జేవీ రావు, దొంతిచిన్న, రాజ్‌కుమార్, గిరి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ శంకుస్థాపన


అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందదర్.

**జూబ్లీహిల్స్, డిసెంబర్ 9, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్‌లోని పలు బస్తీల్లో తాగునీటి పైపులైను పనులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. జవహర్ కాలనీ, అంబేద్కర్ నగర్ బస్తీల్లో రూ.56 లక్షలతో ఈ అభివృద్ధి పనులను చేపట్టను న్నారు. అనంతరం అంబేద్కర్ నగర్ బస్తీలో ఏర్పాటుచే సిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖైరతాబాద్ నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో రూ. 35 కోట్ల విలువైన పారిశ్రామిక మౌళిక వసతుల పనులు చేపడతా మన్నారు. డ్రైనేజీ, నీటి సదుపాయాలు, రోడ్లు, సామా జిక భవనాలు, అంగన్వాడీ కేంద్రాల కోసం ఇప్పటికే నిధులను కేటాయించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి దిశలో పయనిస్తుందని ఒక్క రోజులోనే రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు కుదరడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త మైలురాయిగా ఆయన పేర్కొన్నారు. త్వరలో లక్షలాది ఉద్యోగాలు ఇక్కడ రాబోతున్నాయన్నా రు. బస్తీల యువత విద్యతోపాటు నైపుణ్యాలను పెంచు కోవాలని ఇలాంటి అవకాశాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు మామిడి నర్సింగ్‌రావు, జలమండలి జీయం ప్రభాకర్ మేనేజర్ రాంబాబు కాంగ్రెస్ నేతలు స్వామి గౌడ్, సింహం, మల్లేష్, దీపాగౌడ్, చంద్రకళ, అశోక్, వెంకట్, ఆకుల రాజు, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవాసవిమాత ఆలయ నిర్మాణానికి తోడ్పడండి : విజయ్‌కుమార్ గుప్తా


మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాకు వినతిపత్రం సమర్పిస్తున్న చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్‌గుప్తా, సంఘ ప్రతినిధులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 9 ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని చింతల్‌లో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయ నిర్మా ణానికి ప్రభుత్వస్థలాన్ని కేటాయించి సహకరించా లని చింతల్ కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు జూలూరు విజయ్‌కుమార్‌గుప్తా విజ్ఞప్తి చేశారు. మంగళవారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాకు ఆర్యవై శ్యసంఘ ప్రతినిధులు తరలివెళ్ళి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్బంగా ఆయన మాట్లా డుతూ యావత్ కుత్బుల్లాపూర్ మండలానికే కేంద్ర బిందువైన చింతల్‌లో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి గాను 1500గజాల ప్రభుత్వస్థలం కేటాయించాల ని విజ్ఞప్తిచేశారు. ఈ సందర్బంగా మేడ్చల్ మ ల్కాజ్‌గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా 15రోజులలో సమాధానమిస్తామని హామీఇచ్చిన ట్లు తెలిపారు. ఈసందర్బంగా చింతల్ కుత్బుల్లా పూర్ ఆర్యవైశ్యసంఘ ప్రధానకార్యదర్శి మహం కాళ ప్రభురాజ్‌గుప్తా, సంఘ ప్రతినిధులు జూ లూరు వీరేందర్‌గుప్తా, నేతి జగన్నాధం గుప్తా, నల్లనాగుల సంతోశ్‌కుమార్, ఇళ్ళేందుల క్రిష్ణకు మార్‌గుప్తా, నారాయణ ప్రసాద్‌గుప్తా, గోపారకు ఆంజనేయులు గుప్తా, గోపారపు శ్రీనివాస్‌గుప్తా, బెజగం రాజుగుప్తా, సత్యప్రసాద్‌గుప్తా, కె.శ్రీని వాస్, చొక్కారపు శ్రీనివాస్, చంద్రశేఖర్‌గుప్తా, రమేశ్‌గుప్తా, నవీన్‌గుప్తా, తాటిశెట్టి ఆంజనేయు లు తదితరులు జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తాను కలిసి వినతిపత్రం సమర్పించారు.

## ఎస్ఆర్ నాయక్ నగర్ పార్కును మరింత అభివృద్ధి చేయాలి


పార్క్‌ను పరిశీలిస్తున్న అధికారులు

**నిజాంపేట్, డిసెంబర్ 9, ప్రభాతవార్త** ఎస్ఆర్ నాయక్ నగర్లో వాకింగ్ ట్రాక్ సరిగా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని ఆలూ రి వెంకట శేషాచారి గుబ్బల లక్ష్మీనారాయణ గతంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ కా ర్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఉప కమిషనర్‌కి జిహెచ్ఎంసి పార్కుకి సంబంధించి ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. దానికి సంబంధించి ఎస్సార్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకట శేషచారి, సీనియర్ నాయ కులు గుబ్బల లక్ష్మీనారాయణ వివరణ కోరగా మంగళవారం జిహెచ్ఎంసి కుత్బుల్లాపూర్ సర్కిల్ పాపమ్మ, యుగంధర్ రెడ్డి, జిహెచ్ఎంసి పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్బంగా అధికారులు మాటాడుతూ రూమ్‌కు సంబం ధించి ఎస్టిమేషన్ పంపించామని మిగతావి సంబంధిత డిపార్ట్మెంట్‌కు ఫార్వ ర్డ్ చేయడం జరిగిందని త్వరలో ఈ సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని చెప్పడం జరిగింది. వాకింగ్ ట్రాక్ సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడతామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూర పాటి ప్రభాకర్, పొన్నాడ శ్రీనివాస్, నూక రాజు, వల్లూరి ప్రసాద్, సోమే శ్వరరావు, ప్రవీణ్, ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**పేట్ బషీరాబాద్, డిసెంబర్ 9, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఆటో ఢీకొని గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సం ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ నుండి మెయిన్ రోడ్ వైపుగా ఓ వ్యక్తి వెళ్తుండగా ఆటో ఢీ కొట్టింది. మృతుని వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, మృతుడు యాష్ కలర్ రైన్ కోట్, తెలుపు రంగు గల్లా చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి వెంట్రుకలు పాక్షికంగా తెలుపు రంగులో ఉన్నాయని తెలి పారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసినచో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లోని 9490617229, 8712663248 నెంబర్‌లో సంప్రదించగలరని తెలిపారు.

# ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కార్డియాక్ హెల్త్‌క్యాంప్


హెల్త్‌క్యాంప్‌లో పాల్గొన్న డాక్టర్లతో ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

**హైదరాబాద్,డిసెంబరు 9,ప్రభాతవార్త:** సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్డియాక్ హెల్త్ క్యాంపుకి అనూహ్యమైన స్పందన వచ్చింది. తరచుగా జర్నలిస్టులు హార్ట్ అటాక్స్ కి గురవడం, సడెన్ కార్డియా క్ డెత్స్ కావడం వల్ల జర్నలిస్టుల గుండె ఆరోగ్యం కోసం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఈ క్యాంపును నిర్వహిం చింది. వృత్తి, ఉద్యోగాలే ప్రాధాన్యాలుగా స్ట్రెస్ తో సావాసం చేస్తూ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేసేవాళ్లే ఎక్కువ. నాకేం కాదులే.. అనుకుంటూ స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవడానికి వెనుకాడుతుంటారు. కానీ ప్రస్తుతం మన మాడ్రన్ లైఫ్ స్టైయిల్ వల్ల 30 ఏళ్లలోనే గుండెపోట్లు, సడెన్ కార్డియాక్ డెత్స్ అవుతున్నాయి. నాకెందుకు వస్తుందులే.. నేను హెల్దీగానే ఉన్నాను.. అని అనుకోకుండా, అందుకే అందరూ కార్డియాక్ హెల్త్ పైన దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు జూబ్లీహిల్స్ అపో లో కాథ్ ల్యాబ్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డి యాలజిస్ట్ డాక్టర్ ఎ. శ్రీనివాస్ కుమార్ మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నిర్వహించిన కార్డియాక్ హెల్త్ క్యాంపుకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ చలికాలంలో చల్లని వాతావరణం గుండెను బలహీనం చేస్తుందనీ, చలి వల్ల గుండె రక్తనాళాలు కుచించుకు పోయే అవకాశం ఉండటం, ఫ్లూ లాంటి వ్యాధుల ప్రభా వం వల్ల ఈ సీజన్ లో గుండెపోట్ల ప్రమాదం ఎక్కువగా ఉంటుందని ఆయన అన్నారు. మహిళల్లో గుండెపోట్లు తక్కువని అనుకుంటాం. కానీ జర్నలిజంలో ఉన్న మహి ళల్లో ఒత్తిడి మరింత ఎక్కువ. కాబట్టి వాళ్లలో కూడా గుండెపోట్ల ప్రమాదం పొంచి ఉంటుందని హెచ్చరించా రు. ఈ క్యాంపులో బీపీ, ఈసీజీ, 2డి ఎకో, బీఎంఐ, డెంటల్ టెస్టులను నిర్వహించారు. 200 మంది వరకు టెస్టులు చేయించుకున్నారు.ఈ సందర్బంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రమేశ్ వరికుప్పల డాక్టర్ శ్రీనివాస్ కుమార్, ఇతర డాక్టర్లను సత్కరించారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ లు అరుణ అత్తలూరి, ఎ.రాజేశ్, జా యింట్ సెక్రటరీలు హరిప్రసాద్ చిలుకూరి, బాపూరావు, ట్రెజరర్ రమేశ్ వైట్ల, ఈసీ మెంబర్లు రచన ముడుంబై, నాగరాజు, సత్తిబాబు, అశోక్ లకు జర్నలిస్టులు ధన్యవాదాలు తెలిపారు.

## బాలిక అత్యాచారం కేసులో వ్యక్తి అరెస్ట్

**కంటోన్మెంట్,డిసెంబర్ 9 ప్రభాతవార్త:** అబంశుభం తెలియని 13 యేండ్ల మైనర్ దళిత బాలికపై అత్యాచారం జరిపిన ఓ వ్యక్తిని తుకా రాంగేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అడ్డగుట్టలో నివాసం ఉంటున్న నరేందర్ 25, వృత్తిరీత్యా అటో డ్రైవర్, వారి ఇంటి ముందు నివాసం ఉంటున్న 13 యేండ్ల మైనర్ బాలికను భయబ్రాంతులకు గురి చేసి తన ఇంట్లోకి రప్పించుకొని ఈ నెల 7వ తేదీని రాత్రి మైనర్ బాలికపై అత్యాచారం జరిపాడు. విషయాన్ని తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు చెబితే హతం చేస్తానని బెదిరించాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి ఫోక్సో,ఎస్సీ,ఎస్టీ అత్యాచారం నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.

## తొమ్మిదో తరగతి విద్యార్థిని అష్టావధానం


అష్టావధానం చేసిన అహలాను అభినందిస్తున్న గురువులు

**హైదరాబాద్, డిసెంబరు 9, ప్రభాతవార్త:** భారతీయ సాహిత్య-సాంస్కృతిక సంప్రదాయంలో విశిష్ట ఘట్టంగా, హైదరాబాద్‌లోని ఫ్యూచర్ కిడ్స్ స్కూ ల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని అహలా అయ్యల సోమయాజు అష్టావధానం నిర్వహించింది. నగర శివారులోని చిప్పలపల్లి వేదారణ్యపాఠశాలలో నిర్వహిం చిన ఈకార్యక్రమంలో పెద్దఎత్తున సాహిత్య మేధావులు పాల్గొన్నారు. ఈసందర్బంగా అష్టావధానం చేసిన అహలాను అభినందించారు. అష్టావధానం ప్రదర్శించ డం వైదిక, సాహిత్య, తార్కిక మేధస్సును పరీక్షించే ఈ అరుదైన కళారూపం అని శతాబ్దాల వారసత్వాన్ని మళ్ళీ వెలుగులోకి తెచ్చిందన్నారు. 14 ఏళ్లలో అష్టావధానం చరిత్రలో అరుదైన ఘట్టంచిన్న వయసులో అష్టావధా నం ప్రదర్శించడం అత్యంత అరుదైన సాధన అని కొనియాడారు. వెంకటాద్రి అవధాని, వడ్డిపర్తి పద్మాకర , మేదాసాని మోహన్ గారు వంటి మహానుభావులు మాత్రమే ఈ ఘనతను సాధించారు. అహలా సాధన డిజిటల్ యుగంలో ప్రాచీన భారతీయ గురుకుల సంప్ర దాయాన్ని పునరుద్ధరిస్తూ, సాంప్రదాయ మేధస్సు ఆధు నిక ప్రపంచంలో కూడా ప్రకాశించగలదని నిరూపిస్తోం దని వక్తలు పేర్కొన్నారు.

## దాతృత్వంను చాటుకున్న కాంగ్రెస్ నేత శ్రీనివాస్


బాలుడికి ఆక్సీజన్ సిలిండర్‌ను అందజేస్తున్న కాంగ్రెస్ నేత అంకం శ్రీనివాస్.

**నార్సింగి, డిసెంబర్ 9 ప్రభాతవార్త :** వీధి కుక్కల కాటుకు గురై నెలల తరబడి ఆసుపత్రిలో చికిత్స పొంది నా, కోలుకోకుండా, సొంతంగా ఆక్సీజన్‌ను సైతం తీసు కోలేక ఓ బాలుడు అవస్థలు పడుతున్నాడు. బాలుడి తండ్రి కట్ల శ్రీనివాస్ లక్షల రూపాయలు ఖర్చు చేసి కార్పోరేట్ ఆసుపత్రుల్లో వైద్యంను అందించాడు. అయి నా బాలుడు కోలుకోలేదు. డబ్బులన్నీ ఖర్చుపెట్టినా తన కుమారుడికి ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఆ తండ్రి ఆపన్నుల కోసం ఆశగా ఎదిరి చూస్తున్నాడు. బాలుడి బాధను గురించి తెలుసుకున్న బండ్లగూడ జాగీర్‌కు చెందిన కాంగ్రెస్ నేత అంకం శ్రీనివాస్ చలించిపోయా డు. వెంటనే రూ.లక్షన్నరను ఖర్చుపెట్టి బాలుడికి శ్వాస తీసుకునేందుకు ఆక్సీజన్ సిలిండర్‌ను కొని అందించాడు. ఈ సందర్బంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బాలుడు త్వర గా కోలుకోవాలని నావంతు సహాయం అందించానని తెలిపాడు. బాలుడి ప్రాణాలు నిలిపేందుకు ఆపన్న హ స్తం అందించాలని అభ్యర్థించారు. శ్రీనివాస్ చేసిన సహా యంకు బాలుడి తండ్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గద్దె శంకరయ్య, గాజుల అనంత స్వామి, జక్క దుర్గేష్, రాపోలు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే చోట మహిళలకు రక్షణ కల్పించాలి


మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పోష్ యాక్ట్ 2013 పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**సికింద్రాబాద్, డిసెంబర్ 9 ప్రభాతవార్త:** మహిళ శిశు సంక్షేమ శాఖ హైదరాబాద్ జిల్లా కమిటీ, యాక్షన్ ఎయిడ్, భరోసా ఆధ్వర్యంలో పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం పోష్ యాక్ట్ 2013 అమలులోకి వచ్చిన 9, డిసెంబర్ రోజు పురస్కరించుకుని మహిళలు, భరోసా సిబ్బంది, విద్యార్థులు, వివిధ సంఘాలకు చెందిన మహిళలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం సికింద్రాబాద్ లోని న్యూ బోయిగూడ నుండి గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు జరిగిన ర్యాలీని మహిళా శిశు సంక్షేమ శాఖ సికింద్రాబాద్ ప్రాజెక్టు సిడిపిఓ డాక్టర్ సప్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పనిచేస్తుంటే చిన్న పెద్ద తేడా లేకుండా వారిని లైంగికంగా, మానసికంగా వేధిస్తున్న కేసులు ఎక్కువయ్యాయని అన్నారు.పనిచేసే చోట మహిళలకు సంస్థ యాజమాన్యాలు రక్షణ కల్పించాలని కోరారు. హైకోర్టు న్యాయవాది, హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యురాలు టి. సుభాషిణి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్న ప్రతి ఇండస్ట్రీ, కంపెనీలు, ఫిల్మ్ ఇండస్ట్రీ, ఆర్గనైజ్డ్, అనార్గనైజ్డ్ సెక్టార్ వాళ్ళు, యజమానులు పది మందికి మించి మహిళలు తమ వద్ద పని చేస్తూ ఉంటే తప్పనిసరిగా ఐసీసీ స్థాపించి ప్రతి ఏడాది రిపోర్ట్స్ జిల్లా ఆఫీస్‌కు పంపాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉన్నదని అన్నారు. ఒకవేళ ఈ కమిటీ లేనట్టయితే రూ.50 వేల పెనాల్టీని జిల్లా ఎల్సి వారు వేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోకల్ కమిటీ సభ్యులు వందన పాల్, శైలజ, దీపిక, భరోసా, యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, అంగన్ వాడి టీచర్లు ఇతర మహిళలు పాల్గొన్నారు.


**వార్త CLASSIFIEDS**

**LOST DOCUMENT**

★ I, Thalla Charles Srinivas Rao S/o.Thalla Moses Srinivas Rao R/o. 12-8-277/1/A/C Alugadda Bavi Sec.bad. I Have Lost My Passport (A7742612) & Pan Card. If Found Please Call 7287842877.

★ I, Chiluka Vasantha Vani D/o.Chiluka Devadas R/o. 12-8-277/1/A/C Alugadda Bavi Sec.bad. I Have Lost My Passport (E0636614) & Pan Card. If Found Please Call 7287842877.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

నిట్ నం.& తేదీ: 24/DB/EE/ఆల్వాల్ సర్కిల్/GHMC/2025-26 తేది: 09.12.2025
పని యొక్క పేరు: GHMC, ఆల్వాల్ సర్కిల్, తేది: 16.12.2025 నుండి 21.12.2025కు హైదరాబాద్‌కు, గౌ॥భారత రాష్ట్రపతి పర్యటన సందర్భంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా టాయిలెట్స్‌కు నీటి సరఫరా కలిపి బొల్లారం RP నిలయంలో VVIP మొబైల్ టాయిలెట్స్ మరియు సూపర్ లూ స్టార్ డీలక్స్ పోర్టబుల్ మొబైల్ టాయిలెట్స్ యొక్క సరఫరా మరియు స్థాపన. అంచనా మొత్తం: రూ.లక్షలలో: 21.00, ప్రారంభ తేదీ, సమయం: 10.12.2025 మ.12.00గం. బిడ్ స్వీకరణకు చివరి తేదీ, సమయం : 15.12.2025 మ.12.00గం. EE యొక్క పేరు, చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆల్వాల్ సర్కిల్-27, GHMC తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆల్వాల్ సర్కిల్-27, GHMC.
DIPR.NO. 11869-PP/CL/ADVT/1/2025-26 తేది: 09.12.2025



**IN THE COURT OF THE HON'BLE I SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**S.O.P.No. 123 OF 2025**

**Between: -**
Mohd. Rashed Ali Khan ... **Petitioner**
**AND**
M/s. Akash Hotels Pvt. Ltd and others ... **Respondents**

**NOTICE THROUGH PUBLICATION**

To,
All concerned
(Respondent No.5)
Whereas, the above named Petitioner had filed a case vide Succession O.P .No. 123 of 2025 against the Respondents seeking relief of all that 7/20 shares out of 3,68,450 which works out to Rs.36,84,500/- and Petitioner share amounts to Rs.12,89,575/- against the Respondents No.1 to 5.
The Hon'ble court was pleased to pass an order to serve Notice to Respondent No.5 (All concerned) through "Paper Publication". Hence, the Respondent No.5 (All concerned) hereby summoned to appear in person or by a pleader duly instructed and able to answer all material questions in the above said case and the same is posted on 18.12.2025 at 10:30 AM for your appearance Personally or through your Advocate, failing which the case will be heard and decided in your absence in accordance with Law.

**D. Satish Kumar**
**M. Praveena**
**V. Krishna**
Advocate #304, 3rd Floor, Trident Infra Arcade, Road No.10, Opp to Star Hospital, Banjarahills Hyderabad-34



**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT & SESSIONS JUDGE, RANGA REDDY DISTRICT, AT LB NAGAR**
**G.W.O.P. NO. 80 OF 2025**

**Between:**
V. Kavitha and Others ...**Petitioners**
**And**
Md Khaiser and another ...**Respondents**

**SUMMONS**

To: ALL CONCERN
Take notice that the above-named Petitioners V. Kavitha and Others have instituted as Petition seeking grant of permission to sell the undivided share of the Petitioners 4 and 5 (minors) in the schedule of property. The above petition stands posted on 07-01-2026 at 10:30 A.M., before the above said Hon'ble Court, calling for objections if any from you and for your appearance. If you fail to appear on the date and time mentioned above, either in person or through pleader, the matter will be heard and decided in your absence in accordance with law. **SCHEDULED OF PROPERTY**
All that residential house bearing House Number 11-14-394/31A (PTI No 1031119820) Plot No 31 (South Part) and Plot No 32 (North Part), total admeasuring 173 sq yards or 144.62 Sq Mtrs, having ACC construction of Plinth area of 637 Sq feet, in Sy No 9/1 (Old) and 9/1/L (New) Situated at Ward No 11, Block No 14, in Siri Nagar Colony, Vasthu Colony, Saroornagar Village and Revenue Mandal, Ranga Reddy District, Under LB Nagar Municipal Circle of GHMC North – Plot No 31 Part, South – Plot No 32 Part, East – Plot No 18, H. No 11-14-394/4 West – 30ft Wide Road.

// BY THE ORDERS OF THE HON'BLE COURT //
**Sd/- MALIPEDDI SRINIVAS REDDY**
Advocate
Flat No 501, Shravana Sri Heights, H.No. 12-1-79, Anandi Enclave, Bandlaguda, G.S.I. Hyderabad.
Ph: 9966019179



**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE MEDCHAL MALKAJIGIRI DISTRICT AT: MEDCHAL**
**O.S.N.o. 832 OF 2025**

**Between:**
1. K. RAGINI W/O LATE K.NAGESH aged about 32years, Occ: household
2. K. SRI TRIMAN GOUD S/O LATE K.NAGESH, Aged about 8 yers, occ: student,, Aged about 8 years Rep. by his mother (Plaintiff) being a minor
3. K. SMARAN GOUD S/O LATE NAGESH Aged about 5years, Rep. by his mother (Plaintiff) being a minor
(All the plaintiffs are R/o. H.NO 13-54, NEW LALBAHADUR NAGAR SHAPUR NAGR, QUTUBULLAPUR MAMDAL, MEDCHAL-MALKAJGIRI DISTRICT)
...**Plaintiffs**

**AND**

1. The Mandal Revenue Officer/Tahsildar
2. All Concerned
...**Defendants**

To,
All Concerned
Please take notice that the above suit filed by the plaintiffs against all concern to declare the status of the plaintiffs as legal heirs of deceased LATE K.NAGESH asper the court order the plaintiffs issued the notices to all concern through publication in news paper to concern person/ persons for your appearance on 24-12-2025 at 10-30 A.M. before the above said court. Please make it convenient and attend on said date either in person or through an advocate; otherwise, the matter will be decided in your absence as per law.

**(BY ORDER OF THE HON'BLE COURT)**
**T. Madhuri**
Advocate & Associates
# Kukatpally, Hyderabad

## ఘనంగా బాసర ద్వాదశ జ్యోతిర్లింగ మందిరంలో మాసోత్సవం



**నేరెడ్ మెట్ డిసెంబర్ 9,ప్రభాతవార్త :**
బాసర శ్రీ మహా సరస్వతి దేవాలయం సమీపంలోని శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి స్థాపించిన సిద్ధాశ్రమం (కోటి పార్థివ లింగస్థాప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరం)లో శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్వర్యంలో మాసోత్స వం మరియు ఆరుద్ర నక్షత్ర ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కలశస్థాపన, విఘ్నేశ్వరపూజ అనంతరం శ్రీ మహా గణపతి, శ్రీ వల్లి–దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ మేధా దక్షిణామూర్తులకు మహా రుద్రాభిషేకం, భస్మార్చన, గణపతి, నవగ్రహా, సరస్వతి, మేధా దక్షిణామూర్తి, రుద్రహోమాలు ఘనంగా జరిగాయి. గోపూజ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదిశ్రీ కూచిపూడి అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమతి శ్రీవల్లి పారంకుశం, శ్రీ మీనాక్షి ఇన్స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి వ్యవస్థాపక అధ్యక్షులు జి.వి. మోహన రావు శిష్యులు నృత్యకళార్చన చేసి భక్తులను అలరించారు. నాట్యగురువులకు ఉత్తమ సాంస్కృతిక నాట్యసేవా పురస్కారాలు, కళాకారులకు ప్రశంసాపత్రాలు ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ–సంధ్య దంపతులు అందజేశారు. జిడిగె రాజేశం–విమల దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ వైశ్యులు గాదె ప్రవీణ్–శ్రీదేవి, నూకల గణేష్–అన్నపూర్ణ, పల్లికొండ రాజేందర్–తుకారాం గందేవార్, శక్కరి గోవర్ధన్–పద్మ తదితరులు పాల్గొన్నారు. ఆశ్రమ ప్రాంగణం భక్తుల సందడితో కిక్కిరిసిపోయింది.

### నేరెడ్ మెట్ చౌరస్తాలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



**నేరెడ్‌మేట్, డిసెంబర్ 9,ప్రభాతవార్త :**
కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని నేరెడ్మెట్ చౌరస్తాలో 136వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటూ నేతలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సోనియా గాంధీ సేవలు, నాయకత్వాన్ని స్మరిస్తూ నేతలు పార్టీలో ఐక్యత, బలపరచుకునే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమ ప్రాంగణం కాంగ్రెస్ కార్యకర్తల హర్షధ్వానాలతో సందడిగా మారింది. ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్లు ఎస్.ఆర్. ప్రసాద్, ఇందిరా చంద్రశేఖర్, సీనియర్ నేతలు పి. చంద్రశేఖర్, కుట్టి శ్రీను, రాఘవన్, యాది ప్రవీణ్, జాన్సన్, చెన్నారెడ్డి, రాజు, ప్రభ, మోహన్, శంకర్‌రావు, కృష్ణ, అజయ్, డానియల్, రాజేష్, మల్లిక, విజయలక్ష్మి, మైథిలి, యాప్రాల్ సుధా, కోటేశ్వరి, సుధా నాయుడు, సుధా తదితరులు పాల్గొన్నారు. సోనియా గాంధీ సేవలు, నాయకత్వాన్ని స్మరిస్తూ నేతలు పార్టీలో ఐక్యత, బలపరచుకునే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమ ప్రాంగణం కాంగ్రెస్ కార్యకర్తల హర్షధ్వానాలతో సందడిగా మారింది.

## పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం: చైర్మన్ బాబు శ్రీనివాస్



దేవాలయానికి సంబంధించిన వివరాలను నూతన చైర్మన్ బాబు శ్రీనివాస్ కు అందజేస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

**మలక్ పేట, డిసెంబర్ 9, ప్రభాకర్‌వార్త:**
శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని నూతన దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఓల్డ్ మలక్ పేట్ లోని శ్రీ పోచమ్మ దేవాలయంకు సంబంధించిన వివరాలు, కార్యాలయం తాళాలను దేవాదాయ శాఖ అధికారులు నూతన చైర్మన్ బాబు శ్రీనివాస్ కు అందజేశారు. ఈ సందర్భంగా బాబు శ్రీనివాస్ మాట్లాడుతూ దేవాదాయ శాఖ నగర అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ ఆదేశాలనుసారం దేవాదాయశాఖ అధికారులు, పోలీసుల సహకారంతో ఆఫీస్ తాళాలు పగలగొట్టి నూతన కమిటీకి దేవాలయం కు సంబంధించిన వివరాలు, కార్యాలయం తాళాలను అందజేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ కార్యవర్గ సభ్యులు చౌకి రవికుమార్, శ్రీనివాస్ గుప్తా, శివకుమార్ గౌడ్, దేవాదాయ శాఖ ఇన్ స్పెక్టర్ కిరణ్, సురేందర్, డి. సురేఖ, రాము, చాదర్ ఘాట్ ఎస్ఐ భరత్, నాయకులు శ్యామ్, రవీందర్, బాలరాజ్ గౌడ్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : చేకొలేకర్ శ్రీనివాస్



కేక్ కట్ చేసి మహిళలకు అందజేస్తున్న టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలెకర్ శ్రీనివాస్, చిత్రంలో నాయకులు కిషన్ సింగ్, లింగాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

**మలక్ పేట, డిసెంబర్ 9, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేకొలేకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మలక్ పేట్ సలీంనగర్ లో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకొని సోనియా గాంధీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని వివరించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో పాటు పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రత్యూష మహేష్, కిషన్ సింగ్, సాయిరాం, డివిజన్ అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ గౌడ్, చక్రపాణి, రాహుల్ సింగ్, షాహిద్ ఖాన్, నాయకులు మహేష్, భాస్కర్, మూసా తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్ చిన్న చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్

### సుందరీకరణకు చర్యలు .. కబ్జాలు తొలగించాలని ఆదేశం



రామంతాపూర్ చిన్న చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, డిసెంబరు 9 ప్రభాతవార్త :**
రామంతాపూర్ చిన్న చెరువును మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాద్ మంగళవారం సందర్శించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి అభ్యర్థన మేరకు చెరువును సందర్శించి చెరువు ఆక్రమిత స్థలాలను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాద్ మాట్లాడుతూ రామంతాపూర్ చిన్న చెరువు ఆక్రమణకు గురైందని, చెరువు మురికి కూపంగా మారిందన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణితోపాటు పలువురు పిర్యాదు చేసినట్లు తెలిపారు. చెరువు చుట్టూ బస్తీలు ఉన్నాయని, పదివేల కుటుంబాలు ఉంటున్నాయని, మధ్య తరగతి ప్రజలు అధికంగా నివసిస్తున్నారని, చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత తీసుకుంటున్నామని తెలిపారు. చెరువు సుందరీకరణకు ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపించినట్లు తెలిపారు. ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో చెరువులను మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఈస్ట్, సౌత్ జోన్‌లో అధిక ప్రాధాన్యత తీసుకుంటున్నామని, మూసీకి సమీపంలో ఉండే చెరువులను అభివృద్ధి చేయాల్సి న అవసరం ఉందన్నారు. 2020లో వరదలు వచ్చిన ప్రాంతాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మంచినీటి కలుషిత సమస్యతోపాటు, ఇతర సమస్యలు ఉన్నాయని తెలిపారు. రామంతాపూర్ చిన్న చెరువును సుందరీకరించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేకంగా ప్లే ఏరియా తయారు చేస్తామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి చెరువుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. చెరువులో మురికినీరు చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని, చెరువు సుందరీకరించి బతుకమ్మ కుంటను అభివృద్ధి చేసినట్లుగా చేస్తానని తెలిపారు. చెరువులో అక్రమ పార్కింగ్ అరికట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చెరువు చుట్టూ ఉన్న స్థలాలను పరిశీలించారు. చెరువును ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని అన్ని చెరువును సందరీకరిస్తున్నామని, రామంతాపూర్ చెరువుతోపాటు, కాప్రా, నాచారం చెరువు, పటేల్ కుంట చెరువు సుందరీకరణ గురించి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వివరించారు. ఈ సందర్భంగా చెరువు సమీపంలో చేపడుతున్న పలు ఆక్రమణల గురించి పలువురు పిర్యాదు చేశారు. చెరువు పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, మందుబాబుల బెడద ఉందని పలువురు ఫిర్యాదు చేశారు. చెరువులో ఆక్రమణలు తొలగించాలని, చెరువులో చెత్తాచెదారం వేయకుండా చూడాలని పలువురు విన్నవించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, పలువురు పార్టీల నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

## చిలుకానగర్ చౌరస్తాలో ఘనంగా దీక్షా దివస్ వేడుకలు



చిలుకానగర్‌లో జరిగిన దీక్షా దివస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత, బిఆర్ఎస్ నేతలు

**ఉప్పల్, డిసెంబరు 9 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మంగళవారం చిలుకానగర్‌లో దీక్షా దివస్ వేడుకలు నిర్వహించారు. బిఆర్ఎస్ పార్టీ నేత పిట్టల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు, కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్,పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ 11 రోజుల పాటు అమరణ దీక్ష చేసి డిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని తెలిపారు. తెలంగాణ ప్రకటన వెలువడిన రోజున రాష్ట్రం మొత్తం సంబరాలు చేసుకుంటుందని తెలిపారు. అనంతరం బిసి ఉద్యమం కోసం ఆత్మబలిదానం చేసుకున్న ఈశ్వరాచారి చిత్రపటానికి నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు అంబటి జగదీష్ ముదిరాజ్, నెర్ధం భాస్కర్ గౌడ్, జెల్లి మోహన్, గుడి మధుసూదన్ రెడ్డి, పల్లె నర్సింగ్ రావు, ఈరెల్లి రవీందర్ రెడ్డి కొంపల్లి రవీందర్ ముదిరాజ్,ఆకిటి బాల్‌రెడ్డి, గిరెడ్డి జనార్ధన్ రెడ్డి, ఎం. కైలాసం, సకినాల ప్రసాద్, తిరుమలేష్, రుద్రారపు శంకర్ సదానంద్ చారి, కొంపల్లి రాజ్ కుమార్, రమేష్, కొక్కండ జగన్, ఏదుల కొండల్‌రెడ్డి, శ్యాం పలువురు ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ఆమరణ దీక్షను అవమానించేలా మాట్లాడడం తగదు

### మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



జిల్లెలగూడ చందన చెరువు వద్ద తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి 11 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసిన కెసిఆర్ త్యాగాన్ని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని ఉద్యమం చేసిన కెసిఆర్ దీక్ష ఫలితంగానే 2009 డిసెంబర్ 9న నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిన విషయాన్ని ఓ సారి గుర్తు చేసుకోవాలని ఆమె అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి మీర్‌పేట్ సర్కిల్‌లో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ్ దివస్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్రగా సంద చెరువు ప్రాంగణానికి వచ్చిన సబితారెడ్డి అక్కడి తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం భారీ సంఖ్యలో గులాబి బెలూన్లను గాలిలోకి వదిలారు. ఆ తర్వాత ఆమె మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కెసిఆర్ చేసిన పోరాటం చారిత్రాత్మకమనీ ఇది చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోతుందని అన్నారు. ఆనాడు కేంద్ర హోం మంత్రి చిదంబరం కెసిఆర్‌కు స్వయంగా ఫోన్ చేసి తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేయబోతున్నాం అని హామీ ఇవ్వడంతోనే కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష విరమించారని ఆమె గుర్తు చేశారు. కెసిఆర్ త్యాగాన్ని రాజకీయ కోణంతో చూస్తున్న టిపిసిసి చీఫ్ అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆమె హితవు పలికారు. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రాన్ని అస్థిర పరిచే నిర్ణయాలు తీసుకుంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించిందని సబితారెడ్డి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ మాజీ ఎంపిపి సిద్దాల లావణ్య బీరప్ప, మాజీ ఎంపిటిసిలు లలితా జగన్, పాలపర్తి విజయలక్ష్మి, మీర్‌పేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్లు బొక్క రాజేందర్‌రెడ్డి, ఎనుగు అనిల్ యాదవ్, దోమలపల్లి ధనలక్ష్మి రాజ్‌కుమార్, గడ్డమీది రేఖ లక్ష్మణ్, సిద్దాల పద్మ అంజయ్య, మాజీ కో–ఆప్షన్ సభ్యులు పల్లె జంగయ్యగౌడ్, స్నేహలత, , జిల్లా లైబ్రరీ మాజీ డైరెక్టర్ పంతంగి మాధవి వెంకటేశ్వరరావు, నాయకులు అబ్బనమోని గోపి యాదవ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో పాటు బడంగ్‌పేట్, జల్‌పల్లి సర్కిళ్లు, ఆర్‌కెపురం, సరూర్‌నగర్ డివిజన్ల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల్ స్టేడియంలో పుట్ బాల్ మ్యాచ్‌కు పటిష్ట ఏర్పాట్లు : మంత్రి వాకిటి శ్రీహరి



ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, పోలీసు అధికారులు

**ఉప్పల్, డిసెంబరు 9 ప్రభాతవార్త :** ఉప్పల్ స్టేడియంలో ఈనెల 13న జరిగే మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్ కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, పలువురు పోలీస్ అదికారులు, క్రీడాశాఖ అధికారులతో కలిసి స్టేడియంలో మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నేపధ్యంలో ఏర్పాట్లపై ఉప్పల్ స్టేడియంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం మొత్తం హైదరాబాద్ వైపు చూస్తుందని, మెస్సీతో సీఎం రేవంత్ రెడ్డి ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడుతారని తెలిపారు. ఈ మ్యాచ్ కోసం దేశం నలుమూలల నుండి అభిమానులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మ్యాచ్ కోసం వచ్చే వారికి ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మ్యాచ్ కోసం పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని,ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రేక్షకులకు తగిన పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మల్కాజిగిరి ఎసిపి ఎ.చక్రపాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎఐసిసి మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్న గ్రేటర్ హైదరాబాద్ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్, అజంపుర డివిజన్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు(మలక్ పేట, ప్రభాతవార్త)

### శివసాయినగర్‌లో ఘనంగా సంకట హర చతుర్థి పూజలు



లక్ష్మీ గణపతికి అభిషేకం నిర్వహిస్తున్న పూజారులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:**
మీర్‌పేట్ సర్కిల్‌లోని శివ సాయినగర్ కాలనీలో నున్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో సంకట హర చతుర్థి పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు లక్ష్మీ గణపతిరావు, మధుసూదనాచార్యులు, సతీష్ శర్మలు భక్తిశ్రద్ధలతో పూజాదికాలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పరిసర కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

### కేంద్ర గ్రంధాలయాన్ని సందర్శించిన ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

**ఉప్పల్, డిసెంబరు 9 ప్రభాతవార్త :** నగరంలోని కేంద్ర గ్రందాలయాన్ని మంగళవారం ఉప్పల్ డిగ్రీ కళాశాల తెలుగు విద్యార్థులు సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ జె.విజయ్‌కుమార్, తెలుగు సహాయాచార్యులు జల్దా విశ్వనాద్‌కుమార్ తదితరులతో కలిసి పలువురు విద్యార్థులు గ్రంధాలయ సందర్శన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్ర గ్రందజాలయ పరిషత్ చైర్మన్ డా.ఎం.డి.రియాజ్‌ను కలిసి పలు అంశాలను చర్చించారు.





సోనియా గాంధీ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , పోగుల నర్సింహారెడ్డి ,కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, తదితరులు



పీర్జాదిగూడ సర్కిల్ లో సోనియా గాంధీ జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఫిర్జాదిగూడ పట్టణ అధ్యక్షులు తుంగతుర్తి రవి ,పన్నాల శ్రీనివాస్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి,రామ్ రెడ్డి ,తదితరులు

## మల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్‌గా సుమిత రఘుమారెడ్డి ఏకగ్రీవం



నల్ల సుమిత రఘుమారెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 9 ప్రభాతవార్త:** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచిగా చంపాపేట డివిజన్ సాయిరాంనగర్‌కు చెందిన నల్ల సుమిత రఘుమారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజైన మంగళవారం నాటికి బరిలో సుమిత రఘుమారెడ్డి నామినేషన్ ఒక్కటే మిగలడంతో సర్పంచ్‌గా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని ఎనిమిది వార్డుల్లో ఒక్కొక్కరు మినహా మిగతా వారంతా తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుమిత రఘుమారెడ్డి మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలోకెల్లా మల్లారెడ్డిపల్లిని అభివృద్ధి పథంలో ముదంజలో నిలుపుతానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నుకున్నందుకు గ్రామ పెద్దలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## బతుకమ్మ కుంట మాదిరిగా ఎర్రగుంట చెరువును అభివృద్ధి చేస్తాం -హైడ్రా కమిషనర్ రంగనాథ్



ఎర్రగుంట చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమీషనర్ రంగనాథ్

**సైదాబాద్, డిసెంబరు 9 ప్రభాతవార్త:**
సైదాబాద్‌లోని ఎర్రగుంట చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హైడ్రా కమీషనర్ రంగనాథ్ అన్నారు. ఎర్రగుంట చెరువు కబ్జాకు గురవుతుందన్న స్థానికుల ఫిర్యాదుతో మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారుతో కలిసి ఆయన చెరువును సందర్శించి వివరాలు పరిశీలించారు. అనంతరం హైడ్రా కమీషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ఎర్రగుంట చెరువు స్థలాన్ని కొందరు తమ పట్టా ల్యాండ్ అని చెబుతున్నారని, చెరువుకు సంబంధించిన అన్ని వివరాలను, దాదాపు వంద సంవత్సరాల నాటి డాటాను, సర్వే ఆఫ్ ఇండియా చిత్రాలు, శాటిలైట్ డాటా, రెవిన్యూ రికార్డులను లోతుగా పరిశీలించి మొదటగా చెరువును నిర్ధారిస్తామని అన్నారు. చెరువు నిర్ధారణ అయిన తర్వాత బతుకమ్మ కుంట మాదిరిగా అభివృద్ధి చేస్తామని అన్నారు. చెరువుకు సంబంధించిన హైడ్రాలిక్ ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. తమ విచారణ అనంతరం అన్ని ఆధారాలను కోర్టులో కూడా సమర్పిస్తామని కమీషనర్ రంగనాథ్ తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన స్థానిక రాజకీయ నాయకులు కూడా చెరువుకు సంబంధించిన వివరాలను హైడ్రా కమీషనర్‌కు వివరించారు.

## తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం



తెలంగాణ తల్లి చిత్ర పటానికి పలాభిషేకం చేస్తున్న మెట్టు భాస్కర్ రెడ్డి

**సైదాబాద్, డిసెంబరు 9 ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు దీక్షా విజయ్ దివస్ సందర్భంగా మంగళవారం ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ నాడు కెసిఆర్ చేసిన ఆమరణ దీక్షకు దిగివచ్చిన కేంద్రం తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



రామంతాపూర్‌లో సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 9 ప్రభాతవార్త :**
రామంతాపూర్‌లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియాగాంధీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా జరిగిన కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సోనియా గాంధీ దయతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కల సాకారం నెరవేర్చిన తెలంగాణ తల్లి అమ్మ సోనియా గాంధీ అన్నారు. ఈ సందర్బంగా పలువురు నేతలు కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధి తోఫిక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అగిరెడ్డి, రామంతాపూర్,హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు ఎండి.రఫిక్, విజయ్ కుమార్, ఉప్పల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్, కంది శ్రవణ్ రెడ్డి, గరిక సుధాకర్,వల్లపు శ్రీకాంత్ యాదవ్, జలీల్ పాషా ,లుకాస్, మార్త,ఉపేందర్‌రెడ్డి, బొక్క సురేష్,పేట మురళిముదిరాజ్, సందీప్, భాస్కర్, భాస్కర్ గంగపుత్ర రమేష్, నామ్ రాజిరెడ్డి, శాగ శ్రీధర్, షకీల్,మిట్టు గౌడ్,ధర్మేంద్ర నాయక్, బుల్లెట్ అశోక్,సంధ్య రాణి,బాబు రావు, అంభిక పాల్గొన్నారు.

### బడంగ్‌పేట్ కార్పొరేషన్‌ను చార్మినార్ జోన్‌లో విలీనాన్ని వ్యతిరేకించిన గుర్రంగూడ ప్రజలు



చార్మినార్ జోన్‌లో విలీనంపై మండిపడుతున్న గుర్రంగూడ ప్రజలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:**
జిహెచ్ఎంసిలో విలీనం చేసిన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌ను పాతబస్తీ చార్మినార్ జోన్‌లో కలపడంపై గుర్రంగూడ ప్రజలు మండిపడ్డారు. స్థానిక బిజెపి మాజీ కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డిల ఆధ్వర్యంలో గుర్రంగూడ హనుమాన్ దేవాలయం వద్ద భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున హాజరైన వివిధ కాలనీల ప్రజలు, గుర్రంగూడ గ్రామస్తులు చార్మినార్ జోన్‌లో విలీనాన్ని వ్యతిరేకించారు. ఈ మేరకు ప్రభుత్వం పునరాలోచించి బడంగ్‌పేట్ సర్కిల్‌ను ఎల్‌బినగర్ జోన్‌లో కలపాలని కోరుతూ సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో సమావేశానికి హాజరైన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ పార్టీ అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, గుర్రంగూడ మాజీ పర్సన్ ఇంఛార్జి జక్కిడి జంగారెడ్డిలతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గుర్రంగూడ గ్రామ, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఘనత సోనియాదే



బడంగ్‌పేట్‌లో సోనియా గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, యెల్మేటి అమరేందర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 8 ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ఘనత కేవలం సోనియా గాంధీకే దక్కుతుందని బడంగ్‌పేట్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి కార్యదర్శి, సీనియర్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే యెల్మేటి అమరేందర్‌రెడ్డిలు అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్‌లో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన సోనియా జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా తెలంగాణ ప్రజల పాలిట దేవత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నాయకులు గట్టు బాలకృష్ణ, నవారు మల్లారెడ్డి, టేకుల సుధాకర్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, అమృత నాయుడు, క్యారగాని శ్రీధర్, దిండు శ్రీనివాస్‌గౌడ్, బొల్లపల్లి కుమార్, సూర్ణగంటి విజయ్‌కుమార్, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ సెటిల్‌మెంట్ల లల్లు శ్రావణ్ ఆత్మహత్య...



**కుషాయిగూడ ,డిసెంబర్ 9, ప్రభాతవార్త.**
రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లు చేసే రియాల్టర్ సెటిల్మెంటరుగా గా పేరు మోసిన లల్లు అలియాస్ శ్రావణ్ (36) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాప్రా డివిజన్ కందిగూడా వల్యాల్ నగర్ ప్రాంతానికి చెందిన లల్లు అలియాస్ శ్రవణ్ ఈనెల 8 సోమవారం రాత్రి ఇంటికి వచ్చి మొదటి అంతస్తు కు వెళ్లి డిన్నర్ కు కిందికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్ కోడి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. కుటుంబ కలహాల కారణంగా ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలుస్తోంది. సాధారణంగా ఉండే లల్లు రియల్ ఎస్టేట్ సెటిల్మెంట్లు, మార్గాన్ని ఎంచుకొని అతి తక్కువ కాలంలో ఎదిగాడు. గతంలో కొన్ని కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు సమాచారం. మృతుడు లల్లు అలియాస్ శ్రావణ్ కు భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. లల్లు అలియాస్ శ్రావణ్ కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.